క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయ్ భాస్కర్ ప్రకటించారు. పార్శిగుట్ట ఫీడర్ పరిధిలో బ్రహ్మంగారి ఆలయం, ప్రేయర్ పవర్‌చర్చ్, బాపిస్టిచర్చ్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, గ్రేవ్‌యార్డ్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు 44 నెంబర్ బస్టాప్ ఫీడర్ పరిధిలో గంగపుత్ర కాలనీ, ఫిష్‌మార్కెట్, ఫ్రెండ్స్‌కాలనీ, రామాలయం, అంజయ్యనాలా తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30 వరకు, గోల్కొండ క్రాస్‌రోడ్ ఫీడర్ పరిధిలో ఏక్‌మినార్ మసీద్, కృష్ణకాలనీ, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 5 వరకు స్పెన్సర్ ఫీడర్ పరిధిలో శివాలయం, రాజాడీలక్స్, రేస్‌కోర్స్, ఎన్‌బీకే ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

జానపద వృత్తి కళాకారుల శోభాయాత్ర



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వద్ద నిర్వహించిన ఈ యాత్ర ప్రజలను ఆకట్టుకుంది. అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకరస్వామి వివేకనందుని విగ్రహానికి పూలమాల వేసి శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత దేశంలో భక్తి ఉద్యమాన్ని పెంపొందించడంలో జానపద వృత్తికళాకారుల కృషి మరువలేనిదని కొనియాడారు. జానపద వృత్తికళాకారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, సహాయ కార్యదర్శి వినోద్‌కుమార్, పీఎస్ మూర్తి, శంకర్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు భర్త ఆత్మహత్య

ముషీరాబాద్: భార్య మద్యం తాగొద్దన్నందుకు క్షణికావేశంలో ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి రాంనగర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్‌లోని బర్ధమాన్ తాలూకా కొమ్రంపూర్ గ్రామానికి చెందిన బిల్‌కిస్‌బేబీ అదే గ్రామానికి చెందిన బిక్రమ్‌గోష్‌లు మూడేళ్ల క్రితం ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. అప్పటి నుండి ఆమె స్వగ్రామంలోనే నివసిస్తుండగా భర్త రాజస్థాన్‌లో బిస్కెట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇరువురు బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్దామని నిర్ణయించుకుని నెలరోజుల క్రితం రాంనగర్‌కు వచ్చి తమ గ్రామానికి చెందిన రఫికుల్లా మొల్లా ఉండే ఇంట్లోనే ఉంటున్నారు. ఈనెల 9న స్నేహితుడి ఇంట్లో వంట ముగించుకున్న తర్వాత భార్య తాగొద్దన్నందుకు మనస్థాపానికి గురై భార్యను చార్మినార్ వద్ద స్నేహితుల వద్దే వదిలేసి రాత్రి 11గంటల సమయంలో రాంనగర్ తిరిగొచ్చాడు. ఉదయం 10 గంటల సమయంలో భార్య తిరిగొచ్చి తలుపు తట్టగా.. ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆమె స్థానికులతో కలిసి ముషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసుల సమక్షంలోనే తలుపులు తీయగా భర్త ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో పాల్గొన్న కమలా సుధీర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం: సంక్రాంతి పండుగ సందర్భంగా వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కాలనీలో మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, మహిళా మండలి అధ్యక్షురాలు బి.లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షురాలు బి.సుకృత, కార్యదర్శి జె.వాణి, సంయుక్త కార్యదర్శి ఎల్.చంద్రకుమారి, కోశాధికారి పి.అరుణకుమారి, కార్యవర్గసభ్యులు అరుణ, రజని, రాజకుమారి, జయలక్ష్మి, మధుమతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

అడుగేస్తే అభ్యంతరాలు!

- పలుమార్లు డిజైనింగ్ మార్పులు
- పనిచేయలేక చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- పద్మాకాలనీ నాలా పునర్నిర్మాణ పనుల్లో అడ్డంకులు
- కాలనీ వాసుల అభ్యంతరం 8 నెలలైనా ముందుకు సాగని పనులు



పద్మాకాలనీలో 8 నెలలుగా నిలిచిపోయిన నాలా పునరుద్ధరణ పనులు

ముషీరాబాద్: నగరంలో కురిసిన భారీ వర్షాలకు నలాలు పొంగి ఇళ్లలోకి నీరు చేరడంతో పాటు రోడ్లన్నీ చెరువులను తలపించే పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలోని పద్మాకాలనీ ఈ పరిస్థితిని మార్చేందుకు 'స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు' (ఎస్ఎన్‌డీపీ) కింద సుమారు రూ.60 కోట్లతో నాగమయ్యకుంట వద్ద తూముల వైశాల్యాన్ని పెంచే పనులను చేపట్టారు.

- ◆ పద్మాకాలనీ మీదుగా వెళ్లే నాలాకు ఇరువైపుల కాంక్రీట్ గోడలు నిర్మించి వాటిపై స్లాబ్‌లు వేయడం, నల్లకుంట కూరగాయల మార్కెట్ రోడ్డు వద్ద బాటిల్‌నెక్‌గా ఉన్న నాలా పనుల పునరుద్ధరణ పనులకు స్థానికులు ఆటంకాలు కలిగించడం గమనార్హం.
- ◆ అడుగడుగున అడ్డంకులు సృష్టిస్తూ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేయడం వల్ల పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ◆ కాంట్రాక్టర్లు మార్చిలో ఎస్ఎన్‌డీపీ చేసిన డిజైన్ ప్రకారం పనులను ప్రారంభించారు. 8 మీటర్ల వెడల్పు, 8 మీటర్ల లోతు ఉండేలా రెండు వెంట్స్‌తో పనులు మొదలు పెట్టారు.
- ◆ దీంతో స్థానికులు ఇళ్ల కాంపౌండ్ వాల్స్ వరకు నాలా స్లాబ్ వస్తుందని తమ ఇంటికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని అభ్యంతరం చెప్పడంతో పనులు నిలిపివేసి తిరిగి డిజైన్ చేయాల్సి వస్తుందని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో ఎస్ఎన్‌డీపీ ఈ పనుల నుంచి తప్పుకుని జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు.

ఒక మీటరు మేర కుదింపు..

- ◆ 8 మీటర్ల వెడల్పుకు ఒక మీటరుకు తగ్గించి 7మీటర్లు, రెండు మీటర్ల లోతు ఉండేలా డిజైన్‌ను తయారుచేసి దీనికి స్థానికుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాకుండా పనులు మొదలు పెట్టారు. నెలరోజులు పనులు ప్రారంభమైన తరువాత నాలాకు వేసే స్లాబ్ రోడ్డు కంటే ఎత్తుగా ఉందని, వర్షం వస్తే రోడ్డుపై నీళ్లు ఆగుతాయని స్లాబ్ ఎత్తు తగ్గించాలని మరోసారి అభ్యంతరం వ్యక్తం చేశారు. మళ్లీ పనులను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- ◆ తాజాగా డ్రైనేజీ, వర్షపు నీరు పైప్‌లైన్‌లు భవిష్యత్‌లో అవసరం ఉంటే నాలాలో కలిపేందుకు వీలుగా ప్రతి ఇంటి ముందు రంధ్రాలు వదిలిపెడతామని అధికారులు వివరించారు.

ఎమ్మెల్యే పర్యటనతో ..

- ◆ డ్రైనేజీ పైప్‌లైన్లను ప్రత్యేకంగా వేయాలని స్థానికులు కోరడంతో జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ వారం రోజుల క్రితం పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిపాదనలు పూర్తయితేనే పనులు తిరిగి ప్రారంభించే అవకాశం ఉన్నట్టు సమాచారం.
- ◆ తరచుగా అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ పని తమకు గిట్టుబాటు కాదని ఇద్దరు కాంట్రాక్టర్లు ఇప్పటికే వెళ్లిపోయారు. దీనికి తోడు నాలాలో ఎప్పుడూ నీరు ప్రవహిస్తుండటంతో నీటి ప్రవాహాన్ని మరో వైపుకు మళ్లించి వెంటనే పనులు చేపట్టాల్సి ఉంది. లేదంటే ఇసుకమేట వేసి అదే పనిని తిరిగి కాంట్రాక్టర్ చేపట్టాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

'రైతు ఆత్మహత్యలను నివారించకపోవడం సిగ్గుచేటు'

కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ యాదగిరాచార్యులు తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు లేవని చెప్పడం సిగ్గుచేటని రైతు ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ యాదగిరాచారి, ఆర్థిక విశ్లేషకులు ప్రొఫెసర్ వెంకట్‌నారాయణలు విమర్శించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంసీపీఐయూ కార్యాలయంలో అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన ఆర్థిక విధానాల ఫలితంగా ప్రారంభమైన రైతు ఆత్మహత్యలు నేటికి కొనసాగుతున్నాయన్నారు.

- ◆ పాలకులు మారినా విధానాలు మారకపోవడంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ◆ ప్రభుత్వాలు రైతు ఆత్మహత్యల నివారణకు కనీస చర్యలు చేపట్టకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు.
- ◆ రైతులకు మద్దతు ధర రుణవిముక్తి చట్టాలతో రైతు ఆత్మహత్యలను నివారించవచ్చని సూచించారు. జనవరి 16 నుంచి 31 వరకు అన్ని జిల్లా కేంద్రాలలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, ఫిబ్రవరిలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కౌలు రైతుల సమస్యలపై ఐక్య కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్, కార్యదర్శి తీగల సాగర్, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి ఉషాకిరణ్, నాయకులు మట్టయ్య, భరత్‌భూషణ్, శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి



అంబర్‌పేట: ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి కో–ఆర్డినేషన్ సభ్యులు వలిఉల్లఖాద్రీ, కె.ధర్మేంద్ర, శ్రీకాంత్, సత్యప్రసాద్, వెంకటేష్, జావిద్, సలీం, పాషా, అరుణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద మంగళవారం వారు ప్లకార్డులతో నిరసన తెలిపారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్లక్ష్యం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని దీనిపై ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయూష్మాన్ భారత్ యువజన పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ సూచించారు. ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో మంగళవారం ఆయూష్మాన్ భారత్ యువజన పథకానికి ప్రజల నుంచి దరఖాస్తులను సేకరించారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన 100 మంది దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా ప్రతి ఏటా ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు బద్రినారాయణ, రాజ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, రాజు, మహేష్ తదితరులున్నారు.

సౌందర్యలహరి జ్ఞానప్రదాయిని

చిక్కడపల్లి: సౌందర్యలహరి సంపుటిలోని అలనాటి ప్రసిద్ధి పురుషుల జీవిత విశేషాలను జ్ఞానప్రదాయమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభలో వంశీ ఆర్ట్ థియేటర్స్ శుభోదయం గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సౌందర్యలహరి సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రచయిత్రి భువనేశ్వరి తన రచనను తమ మాతృమూర్తి సీతామలక్ష్మికి అంకితం చేశానన్నారు. సాహితివేత్త ఓలేటి పార్వతీశం, రచయిత్రి డాక్టర్ ముక్తేభారతి, కవయిత్రి రాజ్యశ్రీ, వంశీరామరాజు, రావూరి శ్రీనివాస్, ఏలేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.

అర్ధరాత్రి తవ్వకాలు.. అడిగేదెవరు ?

- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో రోడ్లపై తవ్వకాలు
- రాత్రి సమయంలో డ్రైనేజీ, తాగునీటి కనెక్షన్లు
- గుంతలమయంగా రహదారులు



పద్మారావునగర్ ఈద్గామైదానం ప్రధాన రహదారిలో అర్ధరాత్రి చేపట్టిన తవ్వకాలు

బన్సీలాల్‌పేట్: అధికారుల పర్యవేక్షణ లోపంతో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఇష్టానుసారంగా తవ్వకాలు సాగిస్తున్నారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల అండదండాలతో కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తిపడి ఎక్కడ పడితే అక్కడ రోడ్లను తవ్వేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు ప్రయోజనం కలిగించేలా జలమండలి కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రీ, పగలు తేడా లేకుండా రోడ్లపై తవ్వకాలు చేస్తున్నారు. రాత్రికి రాత్రి తవ్వకాలతో తమ పని పూర్తి చేసుకుంటూ సదరు కాంట్రాక్టర్లు రోడ్లను గోతులమయంగా మారుస్తున్నారనే స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణదారులతో ఎంతో కొంత మాట్లాడుకొని అక్రమంగా డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌లు ఇస్తున్నారు. మారేడ్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలోని పలు సెక్షన్ కార్యాలయాల పరిధిలో రోడ్ల అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. జలమండలి బోయిగూడ, శ్రీనివాస్ నగర్, హుస్సేన్‌సాగర్ సెక్షన్ పరిధిలో అక్రమ తవ్వకాలకు అదుపు లేకుండా పోయింది.

రాత్రి సమయంలో భారీ శబ్దాలతో..

- ◆ బోయిగూడ, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్, జీరా, రాణిగంజ్, బోలక్‌పూర్, గాంధీనగర్, మోండా మార్కెట్, బండిమేట్, శ్రీనివాస్‌రావు నగర్, అభినవనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో అక్రమ రోడ్ల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పద్మారావునగర్ ప్రధాన రహదారి ఈద్గా మైదానం మార్గంలో ఈ నెల 9 అర్ధరాత్రి జలమండలి రోడ్డు తవ్వకాలు సాగించారు. భారీ శబ్దాలతో రోడ్లపై తవ్వకాలు సాగించడంతో స్థానిక అపార్టుమెంట్ వాసులు పోలీసులకు ఫోన్ చేశారు. అర్ధరాత్రి పోలీసులు వచ్చి సదరు తవ్వకాలను నిలిపేశారు. ఈ విషయమై జలమండలి అధికారులతో స్థానికులు ఆరా తీయగా ఓ జలమండలి కాంట్రాక్టర్ ఓ ఇంటి యజమానితో మాట్లాడుకొని డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వడానికి తవ్వకాలు సాగించారనే విషయం బయట పడింది.

కాంట్రాక్టర్ల చేతివాటం?

- ◆ జలమండలికి చెందిన పలువురు కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా రోడ్లపై తవ్వకాలు సాగిస్తూ భారీ మొత్తంలో కాసులు దండుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొందరు స్థానిక నాయకుల సహకారంతో జలమండలి కాంట్రాక్టర్లు రోడ్లుపై తవ్వకాలు సాగిస్తున్నారు. ఇందు కోసం సదరు వ్యక్తుల నుంచి రూ. 50 నుంచి 60 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నూతన నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు.

అనుమతి లేని తవ్వకాలపై చర్యలు

తమ అనుమతి లేకుండా తవ్వకాలు చేపట్టి డ్రైనేజీ, మంచినీటి కనెక్షన్లు ఇస్తే సదరు కాంట్రాక్టర్లపై కఠినంగా వ్యవహరిస్తాం. నిబంధనలు ఉల్లంఘించి జలమండలి ఆదాయానికి గండీ కొట్టే వారి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. అక్రమ తవ్వకాలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే ఉపేక్షించబోం.

– వెంకట్రావ్, జలమండలి డిప్యూటీ జీఎం

పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

అంబర్‌పేట: ఈపీఎస్ పెన్షనర్లకు రూ.7,500 పెన్షన్ ఇవ్వాలని ఈపీఎస్ 1995 'పెన్షనర్స్ నేషనల్ యాజిటేషన్‌కమిటీ' తెలంగాణ నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ధర్నాలో భాగంగా బర్కత్‌పురా పీఎఫ్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ తెలంగాణ అధ్యక్షురాలు లక్ష్మి, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డిలు మాట్లాడుతూ.. ఈపీఎస్ పెన్షనర్లకు ప్రస్తుతం రూ. 1000 పెన్షన్ ఇస్తున్నారని దీనిని రూ.7500కు పెంచి డీఏ ఇవ్వాలన్నారు. పెన్షన్ పెంపుపై సుప్రీంకోర్టు గతేడాది నవంబర్ 4న పెన్షనర్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని దీనిని అమలు చేయకుండా ఈపీఎస్ అధికారులు సర్క్యులర్‌ను జారీచేసి అమలు చేయడం లేదని ఆరోపించారు. దీనిని విరమించుకుని సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని వారు కోరారు.



అప్పు తిరిగివ్వమని అడిగిన వ్యక్తికి బెదిరింపులు

తుపాకీతో చంపేస్తానని బెదిరించిన వైనం

అంబర్‌పేట: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడానికి వెళ్లిన ఓ వ్యక్తిపై అప్పు తీసుకున్న వ్యక్తి కుమారుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. పైగా చంపేస్తానంటూ ఇంట్లో ఉన్న ఎస్‌బీబీఎల్ తుపాకీతో బెదిరింపులకు పాల్పడటంతో అప్పు ఇచ్చిన వ్యక్తి బెంబేలెత్తిపోయాడు. ఈ ఘటన మంగళవారం అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్‌కు చెందిన రవికుమార్ గోల్నాకలో నివసించే శ్రీనివాస్‌రెడ్డికి అవసరం నిమిత్తం 6 ఏళ్ల క్రితం డబ్బులు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా తీసుకున్న వ్యక్తి కాలం గడుపుతున్నాడు. కాగా గత నెల డిసెంబర్ 16న రవికుమార్ గోల్నాకలో ఉన్న అతడి ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా.. సమాధానం దాటవేస్తూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. దీంతో అతడి కుమారుడు శౌమిక్‌రెడ్డి దౌర్జన్యానికి పాల్పడుతూ.. ఇంట్లో నుంచి వెళ్లకపోతే చంపేస్తానని ఇంట్లో ఉన్న తుపాకీతో బెదిరించాడని రవికుమార్ చెప్పాడు. దీంతో భయాందోళనకు గురైన రవికుమార్ అంబర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి తన కుమారుడిని బంధువుల ఇంట్లో ఉంచి అనంతరం 18న అమెరికాకు పంపినట్టు సమాచారం. పోలీసులు న్యాయ సలహామేరకు ఈ నెల 5న అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా ఇన్‌చార్జ్‌గా షబాన



బీజేపీ మైనార్టీ మోర్చా నాయకుడు ఎం.ఐజాక్‌రాజ్ తదితరులు

నల్లకుంట: బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా ఇంచార్జ్‌గా నియమితులైన షబానను ఆ పార్టీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఐజాక్‌రాజ్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాత్రి ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో షాబానాను మైనార్టీ నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఐజాక్‌రాజ్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్‌పాషా, జాతీయ కార్యదర్శి నాయక్ అలీ, హనీఫ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల సినీసంగీత విభావరి

చిక్కడపల్లి: ఘంటసాల శతజయంతిని పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక సంస్థలు పలు వేదికలపై సంగీత విభావరి నిర్వహిస్తున్నాయి. మంగళవారం 'జీవీ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్' ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలోని లలిత కళావేదికపై నిర్వహించిన ఘంటసాల సినీ విభావరి సభికులను అలరించింది. శ్రీనివాసనాయుడు, బాపిరాజు, నాగమణి, వేణుగోపాల్, రామకృష్ణ, గిరిజ, సుధ, కామేశ్వరి తదితరులు గీతాలను ఆలపించారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు, కళాపోషకుడు రఘువీర్‌గౌడ్, కృష్ణమూర్తి గాయకులను సత్కరించారు.



త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



చిక్కడపల్లి: త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో కళాసుబ్బారావు కళావేదికలో త్యాగరాజస్వామి 176వ ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. త్యాగరాజస్వామి కీర్తనలు తమిళులు ఎక్కువగా ఆదరిస్తున్నారని సంగీతం అధికంగా సాహిత్యం ప్రధానంగా వారి కీర్తనలు ఉంటాయన్నారు. గానసభ అధ్యక్షురాలు కళా జనార్దనమూర్తి, కవిజెల్లి విద్యాధరరావు, ఉష తదితరులు పాల్గొన్నారు. అనంతరం శివపార్వతి శిష్యబృందం త్యాగరాజస్వామి గోష్టిగానం చేశారు.

త్యాగరాజ స్వామి ఆరాధన..

నల్లకుంట: శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి 176వ ఆరాధన ఉత్సవాలు, సంగీత విద్యాలయం 67వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాసశర్మ ప్రకటించారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం ధ్యాన మందిరంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా టీవీ దర్శక, నిర్మాత శోభాశంకర్ హాజరవుతారన్నారు. సంగీత విద్యాలయం ఆన్‌లైన్, ఆఫ్ లైన్ విద్యార్థులంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

కమ్యూనిటీహాల్ పనులు పూర్తిచేయాలని వినతి



చిక్కడపల్లి: అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో పనులను పూర్తిచేయిస్తామని స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, స్థానికులు, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు వినయ్‌కుమార్ మంగళవారం అశోక్‌నగర్ లైబ్రరీహాల్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వారు కార్పొరేటర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఈ ఏడాది కేంద్రమంత్రి బడ్జెట్‌తో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు తాము చేసిన విజ్ఞప్తికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో కమ్యూనిటీహాల్ నిర్మాణపనులు ప్రారంభిస్తామని అసోసియేషన్ సభ్యులకు ఆమె హామీ ఇచ్చినట్టు సమాచారం. అసోసియేషన్ సభ్యులు ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని వినయ్‌ను శాలువాతో సత్కరించారు. అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు రామమూర్తి, కార్యదర్శి సూర్యప్రకాశ్, కోశాధికారి రమేష్, నాగలక్ష్మి, సత్యనారాయణ, వై.శ్రీరామ్ తదితరులున్నారు.

రౌడీషీటర్ దాడిలో వ్యక్తి మృతి

అంబర్‌పేట: తమ్ముడి కుటుంబంలో చిచ్చు పెట్టొద్దన్నందుకు ఆ వ్యక్తిపై ఓ రౌడీషీటర్ దాడి చేశాడు. ఈ దాడిలో చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకకు చెందిన సునీల్‌రాజ్ (54) పవన్ అన్నదమ్ములు. కాగా గత కొంత కాలంగా పవన్ దంపతుల మధ్య గొడవలకు ఇదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ శ్యామ్‌రాజ్ కారణమవుతున్నట్లు అతడి సోదరుడు సునీల్‌రాజ్ గమనించారు. దీంతో ఈనెల 6న రాత్రి సోదరుడు, మరో స్నేహితుడితో కలిసి సునీల్‌రాజ్ రౌడీషీటర్ ఇంటికి వెళ్లారు. తన తమ్ముడి కాపురంలో చిచ్చు పెట్టవద్దని అతడిని కోరగా..మాట మాట పెరగడంతో శ్యామ్‌రాజ్ తన కుమారులతో కలిసి సునీల్‌రాజ్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. తీవ్రంగా గాయపడిన సునీల్‌రాజ్ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.